

ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్టం)
హిందూపురం : 35.0
పెనుకొండ : 38.0
మడకశిర : 35.0

క్లుప్తంగా

‘వైఎస్సార్ బీమా’లో పేరు నమోదు చేసుకోండి



హేమావతిలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని ప్రజలు ఈ నెల 7లోపు వైఎస్సార్ బీమా పథకంలో పేరు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. 18 నుంచి 70 సంవత్సరాల లోపు ఉన్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు వైఎస్సార్ బీమా కుటుంబ సభ్యులకు వస్తుందని, అదే 18 నుంచి 50 సంవత్సరం లోపు సహజంగా మరణిస్తే రూ.లక్ష వస్తుందన్నారు. ఈ విషయాన్ని హేమావతి గ్రామ సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు మైకు ద్వారా ప్రజలకు వివరించారు.

ముగిసిన వేసవి శిక్షణ



మెమొంటోలతో విద్యార్థులు

హిందూపురం టౌన్: స్థానిక ఆర్టీసీ కాలనీలోని ఆదం మసీదులో మదరసా విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆదం మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముస్లిం పిల్లలకు ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై ఖురాన్ ప్రవర్త మహమ్మద్ సొల్లాల్లహు అలైహి వసాల్లమ్ సందేశాలపై శిక్షణ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు హఫీజ్ తన్వీర్, ఉబేదుల్లా హుస్సేన్, అస్లద్, ఇర్ఫాన్, హుస్సాన్, నయాజ్, అబ్దుల్, ఇలియాజ్, ఉమర్‌ఫారూక్, మోహిస్సన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల బైక్ ర్యాలీ



పెనుకొండలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సానే ఉమారాణి, నాయకులు

పెనుకొండ: పట్టణంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకురాలు సానే ఉమారాణి నేతృత్వంలో పలువురు నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా సానే ఉమారాణి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల ప్రజారంజక పాలన పూర్తి చేసిన సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని హలుకూరు సమీపంలో ఉన్న మోడల్ పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుళపతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి

హిందూపురం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో డిపో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జోనల్ కార్యదర్శితోపాటు రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి మాట్లాడుతూ డిపోలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి రంగనాథ్. కిరణ్ కుమార్. వలి సాబ్, బాబా ఫక్రుద్దీన్, విజయలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి



జమ్మానిపల్లిలో పూజలందుకుంటున్న లక్ష్మీ నిడిమామిడమ్మదేవి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు

మడకశిరరూరల్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సత్యనారాయణ స్వామి పూజ నిర్వహించి భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. జమ్మానిపల్లిలో లక్ష్మీనిడి మామిడమ్మ దేవి, భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకూ స్వామి ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ పూజ నిర్వహించిన దృశ్యం

జిల్లా స్థాయి ‘స్పందన’కు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిరలో సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. స్పందన కార్యక్రమం జరిగే వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలను ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే సమావేశమై చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ హేమకుమార్‌తో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఉచితంగా భోజన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎలాంటి అనారోగ్యానికి గురైన వెంటనే వైద్య సేవలందించడానికి వీలుగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం మడకశిరలోనే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

హిందూపురం టౌన్: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేస్తున్న విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ ఆదివారం పేర్కొన్నారు. ఈ నెల 11న ఆయా కేంద్రాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష జరగనుందన్నారు. హాల్ టికెట్లను htt p://apms.apcfss.in వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నిమ్మల అక్రమాలపై చర్చకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోరంట్ల: హిందూపురం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప రాజకీయ జీవితమంతా అక్రమాలతో కూడుకుందని, ఆయన అవినీతిని ఆధారాలతో సహా నిరూపిస్తామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. దీనిపై ధైర్యముంటే బస్టాండ్ సర్కిల్ వద్ద చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే శంకరనారాయణపై మాజీ ఎంపీ నిమ్మల చేసి వ్యాఖ్యలపై స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్‌రెడ్డి, తదితరులు విలేకరులతో మాట్లాడారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిమ్మల రాజకీయాల్లోకి రాకముందే ఆయన తండ్రి నిమ్మల రంగప్ప 1968 లో ఇన్‌కం ట్యాక్స్ చెల్లించినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇన్ కంట్యాక్స్ చెల్లించే స్థాయిలో ఉన్న మీ కుటుంబం 2004లో ప్రభుత్వం విద్యుత్ బకాయి మాఫీ చేసినప్పుడు ఎందుకు లబ్ధిపొందిందని ప్రశ్నించారు. తాను మంత్రిగా, ఎంపీగా ఉన్నప్పుడు చట్టానికి లోబడి పనిచేశానని, ఎక్కడా అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని చెప్పడం విడ్డూరమన్నారు.

చట్టవిరుద్ధంగా అసైన్డ్ భూములు కొనలేదా?..

పాలసముద్రం సమీపంలో చట్ట విరుద్ధంగా అసైన్డ్ భూములు కొని, అందులో గోదాములు నిర్మించింది వాస్తవం కాదా? అని నిమ్మలను నాయకులు ప్రశ్నించారు. మంత్రిగా ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఐదెకరాల పొలం కొనుగోలు చేసి, ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాలకు కట్టబెట్టలేదా అన్నారు. అదే అసైన్డ్ భూములు కొనుగోలు చేసి, సీనంవాండ్లపల్లి సమీపంలో ఫంక్షన్ హాలు నిర్మించారన్నారు. మల్లాపల్లి సమీపంలో రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి, ఈదుల కుంటను కబ్జా చేశారన్నారన్నారు. ఇన్ని చేసిన మీరా.. ఎమ్మెల్యే శంకరనారాయణపై మాట్లాడేది నిలదీశారు. అనంతరం వారు పార్టీ కార్యాలయం నుంచి న్మిల కిష్టప్ప ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి నిమ్మల కిష్టప్పకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేనాయక్, సమరసింహారెడ్డి, జొన్న ఆంజనేయులు, నార్సింపల్లి శివారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు బాషా, మాజీ టౌన్ కన్వీనర్ మేదర శంకర, బుల్లెట్ బాబు, సుబ్బారెడ్డి, వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తాం



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

హిందూపురం: వచ్చే ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని ముస్లింలు పేర్కొన్నారు. స్థానిక అల్‌హిలాల్ స్కూల్ నుంచి ముస్లిం మైనార్టీలు, ముతవల్లిలు పెనుకొండ రోడ్డు, పరిగిరోడ్డు, గాంధీసర్కిల్, మార్కెట్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ రోడ్డు నుంచి తిరిగి అల్‌హిలాల్ స్కూల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిలో అంబేడ్కర్‌విగ్రహానికి పూలమాలలు వేసి సర్కిల్ వద్ద దువా చేశారు. హిందూపురం నియోజకవర్గంలో దేవుడు దయ, ప్రజల దీవెనలతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామని నినదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, ముత్తవల్లిలు నూరుల్లా, హుమయూన్, రఫీక్, నజీర్, మాజీ ముతవల్లి కలీముల్లా మాట్లాడుతూ నాలుగేళ్లుగా హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం ఎమ్మెల్సీ మహహ్మద్ ఇక్బాల్ కృషి చేశారన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, మరోసారి సీఎంగా జగన్‌ను చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆయుబ్, రహమత్‌బీ, నాగేంద్రమ్మ, రోషన్, ముస్తక్, ముస్లీం మైనార్టీ నాయకులు కట్లబాషా, చందు, ఆర్‌కె ఖలీల్, మన్సూర్, రహమత్, లతీఫ్, ఇలియాజ్, ఫైరోజ్, చాంద్, నౌషాద్, మున్నా, షరీఫ్, హుమయూన్, షఫీ, బాబు, మల్లికాబాను, జబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, శివ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ, మానవహారం



మానవహారంగా ఏర్పడిన దృశ్యం

మడకశిర: ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆదివారం మడకశిరలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. సీఐటీయూ, గ్రామిక మహిళా సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలిపారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. బ్రిజ్‌భూషణ్‌శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షుడు దిల్షాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శివెంకటేష్, జిల్లా గౌరవాధ్యక్షులు ఇంతియాజ్, కోశాధికారి సాంబశివ, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, వివిధ సంఘాల నాయకులు రమణనాయక్, పెద్దన్న, రామాంజనేయులు, యోగానంద్, జంగాలపల్లి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

నివాళి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: మండలంలోని హెచ్‌టీ హళ్లి గ్రామానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సెక్రటరియేట్ విశ్రాంత సెక్షన్ ఆఫీసర్ డి.రంగస్వామి (72) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆదివారం స్వగ్రామమైన హెచ్‌టీ హళ్లి గ్రామానికి పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. స్నేహితుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకుని డి.రంగస్వామి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజీ హళ్లి, మల్లినమడుగు పంచాయతీల సర్పంచులు సదాశివప్ప, శారదమ్మ, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మాజీ అధ్యక్షుడు సంతోష్, నాయకులు ఎంజేయంజారప్ప, బసవరాజు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: పట్టణంలోని వీవర్స్‌కాలనీలో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయంలో ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చనలు,పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సర్వకార్యాలకు తొలిపూజాధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు హిందూపురం ప్రజలందరిపై ఉండాలన్నారు. ఆలయంలో గ్రానెట్ నిర్మాణానికి తన వంతుగా రూ.75 వేలు విరాళంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పేరుద్రయ్య, కిష్టప్ప, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం: మలుగూరు పంచాయతీలోని నందమూరి నగర్‌లో ఆదివారం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సర్పంచ్ రమేష్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతోపాటు ప్రభుత్వం నుంచి ఇతర సేవలు అందుతాయన్నారు. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏకశప్ప, శేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మ రమణ, నరసింహప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

పెనుకొండ రూరల్: స్థానిక 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వానాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఘటనపై స్థానికులు తెలిపిన మేరకు.. తాడిమర్రికి చెందిన విశ్వనాథ్ ద్విచక్ర వాహనంపై పెనుకొండ వైపు వెళ్తుండగా, మార్గంమధ్యలో కియా పరిశ్రమ ఎదురుగా అదుతప్పి డివైడర్‌ను ఢీకొనింది. ఇదే సమయంలో వైనుకవైపు నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న రమణ, బాలకృష్ణ ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

అన్నదాన సత్రానికి పోటెత్తిన భక్తులు



అన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న పర్యాటకులు

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంకు సమీపంలో వున్న అన్నదాన సత్రానికి ఆదివారం ఉదయం భోజనాలు చేయడానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు, పర్యాటకులు ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. నంది విగ్రహం, జటాయువు పక్షి, థీంపార్కు తదితర ప్రాంతాలను తిలకించారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రాలతో కూడిన మాల

హిందూపురం: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని ఆదివారం స్థానిక పాండురంగనగర్‌లోని ఓం క్రియేషన్ ఆర్ట్స్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు సినీ ప్రపంచానికి అందించిన సేవలను కొనియాడారు. ఓంక్రియేషన్ నిర్వాహకురాలు సరస్వతీ బాలసుబ్రహ్మణ్యం పెన్సిల్‌తో వేసిన చిత్రాల మాల ఆకట్టుకుంది.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం/రొళ్ల: అమరాపరం మండలంలోని హేమావతిలో సిద్ధేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అలాగే రొళ్ల మండలంలోని తిరుమలదేవరపల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూజ రోజు కావడంతో స్వామి మూల విగ్రహాన్ని గంగా జలంలో శుద్ధి చేసి అభిషేకించారు.

రోడ్డు మరమ్మతు

రొద్దం: మండలంలోని రొద్దం నుంచి సుబ్బరాయప్ప కొట్టాల మీదుగా ఆర్.కుర్లపల్లి వెళ్లే ప్రధాన రహదారికి ఎమ్మెల్యే శంకరనారాయణ ఆదేశాలతో మరమ్మతులు చేస్తున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం జేసీబీలతో పనులను ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించి, రోడ్డుపై ఉన్న గుంతలకు మట్టి వేశారు. త్వరలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చక్రాల కుర్చీ అందజేత

పావగడ: పట్టణంలోని గుట్టహళ్లి నివాసి అనంతలక్ష్మి అనే దివ్యాంగురాలు అనారోగ్యం బారిన పడి రెండు కాళ్లలో సత్తువ కోల్పోయి నడవడానికి నరకయాతన పడుతుండేది. ఆమె పరిస్థితి తెలుసుకుని స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ ఆమెకు ఆదివారం ఉచితంగా చక్రాల కుర్చీ అందించారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకాల అనంతరం పుష్పాలంకరణ చేసి అర్చనలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతరంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి భక్తులు గోవిందా నమస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం మంగళహారతులిచ్చి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకుడు గోవిందశర్మ, కమిటీ సభ్యులు నరసింహులు పాల్గొన్నారు.



పూలరథంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చిన దృశ్యం

తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిర(అగళి): అగళి మండలంలోని హెచ్‌డీహళ్లి తండాలో ప్రజాప్రతినిధులు, అధి కారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గత కొన్ని రోజుల నుంచి గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడేవారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల స్థానికులు స్థానిక సర్పంచు రామకృష్ణప్పకు విన్నవించు కున్నారు. వెంటనే స్పందించిన సర్పంచు, ఎంపీపీ రేణుక తదితర ప్రజాప్రతినిధులు మండల గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేయించి ఆదివారం బోరు వేయించారు. బోరులో నీరు సమృద్ధిగా పడడంతో ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యుడు నాసిర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

పావగడ: తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగలమడక గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్‌లో వెళ్తున్న ద్వితీయ పీయూసీ విద్యార్థి సుధీర్ తీవ్రంగా గాయపడ్డాడు. ముందు వెళ్తున్న ఎద్దుల బండి మసక చీకట్లో సరిగా కనిపించక పోవడంతో .. వెనుక స్కూటర్ మీద పావగడ వైపు వెళ్తున్న సుధీర్ బండిని ఢీకొట్టాడు. ఘటనలో అతడికి కడుపు భాగంలో తీవ్ర గాయాలవడంతో బంధువులు బెంగళూరుకు తరలించారు. స్కూటర్ వెనుక కూర్చున్న మరో వ్యక్తికి చిన్నపాటి గాయాలయ్యాయి. స్కూటర్ నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతిలో ఖాళీగా సీట్లకు సోమవారం నుంచి 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామాంజనేయరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్షలోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 20వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతిభతో పాటు రిజర్వేషన్ మేరకు ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. 6 వతరగతిలో బీసీ(డీ)-1, 7వ తరగతిలో బీసీ(బీ)- 1, బీసీ(ఈ) -1, 8వ తరగతిలో బీసీ (ఏ)- 1, ఎస్సీ -1, ఎస్టీ -1, 9వ తరగతిలో బీసీ(ఏ)- 2, బీసీ (బీ)-1, బీసీ (డీ)- 1, ఎస్టీ-1 చొప్పున సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరో తరగతిలో ఓసీ, ఈబీసీ-1, ఎస్సీ-2, ఎస్టీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. ఏడో తరగతిలో ఓసీ, ఈబీసీ-1, బీసీ-ఏ-1, బీసీ-బీ- 3, బీసీ-డీ 1, ఎస్సీ-1, ఎస్టీ-1, ఎనిమిదో తరగతిలో బీసీ-బీ- 2, బీసీ-డీ- 1, ఎస్సీ-1, తొమ్మిదో తరగతి బీసీ-బీ- 2 ఖాళీలు ఉన్నాయన్నారు.